# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 27 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధను వినియోగించుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో జరిగే ప్రాంతీయ కార్మిక సదస్సును కేంద్ర, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే ఈ రోజు ప్రారంభిస్తారు.**
3. **తెలంగాణలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజు సమావేశం నిర్వహించనుంది.**
4. **ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

-----------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని లోక్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్,

అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత, శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

----------------------

హైదరాబాద్ లోని లోక్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్"ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

----------------------

ప్రభుత్వ సేవల్లోనూ కృత్రిమ మేధ ఏఐని వినియోగించుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారం తగ్గించాలని సూచించారు. సాంకేతికతను ఉద్యోగులు, అధికారులు విస్తృత స్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. 2026 సంవత్సరాన్ని సాంకేతిక ఆధారిత ఏడాదిగా మార్చుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు

----------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో ప్రాంతీయ కార్మిక సదస్సును కేంద్ర, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈరోజు ప్రారంభిస్తారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ప్రాంతీయ కార్మిక సదస్సును కేంద్రమంత్రితో రాష్ట్ర కార్మిక మంత్రి వాసంసెట్టి సుభాష్ సంయుక్తంగా ప్రారంభించనున్నారు. ఈ సదస్సులో శోభా కరంద్లాజేతో పాటు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ, పుదుచ్చేరి కార్మిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. కార్మిక చట్టాలు, ఉపాధి అవకాశాలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాల అమలు, అంతర్రాష్ట్ర సమన్వయం వంటి కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. సదస్సులో పాల్గొనేందుకు నిన్న రాత్రి విజయవాడ చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వాగతం పలికారు.

-----------------------

ఇంటింటికీ సురక్షిత త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పరిసర గ్రామాల్లో తాగునీటి పథకాలకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

తెలంగాణలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజు సమావేశం నిర్వహించనుంది. ఫిబ్రవరి 15 లోపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఏడు నగరపాలక

సంస్థలు, 116 పురపాలక సంఘాలలో ఎన్నికల షెడ్యూలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఈ సమావేశం నిర్వహించనుంది. అనంతరం మధ్యాహ్నం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో సమావేశం కానుంది. ఈ సమావేశాల అనంతరం సాయంత్రం ఎన్నికల షెడ్యూలును ఎన్నికల సంఘం వెలువరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

----------------------

ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన చర్చిని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ఐక్యంగా పనిచేసి మంగళగిరి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో తోటివారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని మంత్రి పేర్కొన్నారు.

----------------------

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ పురస్కారం తెలుగు హాస్యానికి దక్కిన గౌరవమని తెలుగు చలనచిత్ర నటులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కళల విభాగంలో పద్మశ్రీ పురస్కారానికి ఆయన్ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దీనిపై రాజేంద్ర ప్రసాద్ స్పందిస్తూ..

వాయిస్..25 సెకన్లు

----------------------

అర్హులైన వారందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో 2.5 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి

పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలోనే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని, మరో మూడు విడతల్లో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

-----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ.. 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు"-స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత పర్యావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుధ్య నిర్వహణ, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

-----------------------

ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 8.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో సంగారెడ్డి జిల్లాలోని కోహిర్లో 5.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

=====================